సాక్షి
పెద్దపల్లి
గురువారం ¦ 20 ¦ ఏప్రిల్ ¦ 2023



ఓడినా.. గెలిచినా ఆనందమే

యుద్ధంలో ఓడినా గెలిచినా విషాదం ఉంటుందని, అదే క్రీడల్లో ఓడినా.. గెలిచినా ఆనందమేనని మల్టీ జోన్–1 ఐజీ ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి అ న్నారు. 8లో



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో బుధవారం భక్తులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
44.0/27.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి అధికమవుతుంది. వడగాలులు వీస్తాయి.

తమ సంపదను దైవమార్గంలో ఖర్చు చేసేవారికి దైవ అనుగ్రహం లభిస్తుంది.
– మహమ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
గురు	6:37	శుక్ర	4:29

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

అవకతవకలపై విచారణ చేపట్టండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు సతీష్, వివేక్

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేస్తున్న వ్యాధి నిర్ధారణ కేంద్రంలో పనిచేసేందుకు చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయని, దానిపై విచారణ చేపట్టాలని ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు కొండి సతీశ్, జేఎన్టీయూ జేఏసీ కన్వీనర్ ఆకుల వివేక్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ సంగీతకు బుధవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన నియామకాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: వ్యాపార సముదాయాల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నియంత్రించేందుకు వీలుగా అవసరమైన పరికరాలను అమర్చుకోవాలని ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని జెండాకూడలి, కోఠి, మెయిన్ రోడ్‌లోని వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. దుకాణాల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే నివారణ చర్యలు తీసుకునే విధానాలపై ఆచరణాత్మకంగా వివరించారు. పోస్టర్లు అంటించి, కరపత్రాలు పంచారు. సిబ్బంది సిరాజుద్దీన్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

నేటి నుంచి బూస్టర్ డోస్ పంపిణీ

సుల్తానాబాద్: జిల్లాలో గురువారం నుంచి బూస్టర్ డోస్ వేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 16 ప్రాథమిక, 8 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు ఈ బూస్టర్ డోస్ వేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృపాబాయ్ తెలిపారు. జిల్లాకు ఎనిమిది వేల డోసులు వచ్చాయని, జిల్లావ్యాప్తంగా 12వేల మందిని అర్హులుగా గుర్తించామని వివరించారు.

పెరుగుతున్న కరోనా నేపథ్యంలో

రాష్ట్రవ్యాప్తంగా కరోనా కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో కేంద్రప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలకు జాగ్రత్తలు, సూచనలు చేస్తూనే కట్టడి చేసేందుకు టీకాలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇందులోభాగంగా ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు సీహెచ్‌సీలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో చాలామందికి స్వల్ప లక్షణాలే అధికంగా ఉంటున్నట్లు డాక్టర్లు చెప్తున్నారు.

బూస్టర్ డోస్‌తో ముందుకు..

గురువారం నుంచి అన్ని కేంద్రాల్లో కార్బేవ్యాక్స్ వేయనున్నట్లు కృపాబాయి తెలిపారు. 12 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ఫస్ట్, సెకండ్ డోస్ వ్యాక్సిన్ తీసుకున్న వారు కూడా ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చని డాక్టర్లు తెలిపారు.

26 నుంచి ఆల్ ఇండియా చెస్ పోటీలు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ గురుకులాల ఆల్ ఇండియా ఓపెన్ ఫైడ్ రేటింగ్ చెస్ పోటీలు ఈనెల 26నుంచి 30 వరకు హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరుగుతాయని డీఈఓ మాధవి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 21లోగా తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఎంట్రీ ఫీజు ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.2,500, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.1500గా ఉందని, విజేతలకు బహుమతులు అందిస్తారని వివరించారు.

మీటర్లు గిరగిరా..!

- భగభగ మండుతున్న భానుడు
- పెరుగుతున్న విద్యుత్ వినియోగం
- 19 రోజుల్లో 147.71 మి.యూ.వాడకం
- ఇళ్లకే పరిమితమవుతున్న జనం



నాలుగు రోజుల్లో విద్యుత్ వినియోగం ఇలా..				
తేదీ	16	17	18	19
మి.యూనిట్లు	6.88	7.73	7.95	7.98

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో విద్యుత్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఎండల తీవ్రత, పరిశ్రమల అవసరాలతో ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. వారంరోజులుగా గృహ, వాణిజ్య అవసరాలకు విద్యుత్‌ను అధికంగా వాడేస్తున్నారు. ఓ వైపు భానుడు భగభగమంటుంటే మరోవైపు విద్యుత్ మీటర్లు గిరిగిరా తిరుగుతున్నాయి. ఉక్కపోత పెరగడంతో ప్రజలు ఏసీలు, కూలర్లను రోజంతా నడిపించాల్సి వస్తోంది. మరోవైపు బోర్ల కింద పంట సాగు చేసిన రైతులు.. నాసిరకం మోటార్లను వినియోగించడం కూడా విద్యుత్ డిమాండ్‌కు కారణంగా చెబుతున్నారు. జిల్లాలో గృహ విద్యుత్ కనెక్షన్లు 2.24లక్షలు, వ్యవసాయ కనెక్షన్లు 82వేలు, ఇతర కనెక్షన్లు 20,311 ఉన్నాయి. వీటిద్వారా రోజుకు వినియోగం 6.08 మిలియన్ యూనిట్లు. అయితే వారంరోజులుగా సగటున 7.98 మి.యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతోంది. అలాగే 19రోజుల్లో 115 మి.యూనిట్లకు ఇప్పటివరకు 147.61యూనిట్లు వినియోగం జరిగింది.

ఒకటి ఆదా చేస్తే రెండింటికీ లాభం

సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తుండటంతో నీటి లభ్యత ఉన్న ప్రతిచేనూ పండుతోంది. ఆటో స్టార్టర్లు పెట్టడంతో కొంతమేరకు కరెంటు వృథా అవుతోంది. విద్యుత్ వినియోగాన్ని తగ్గించాలన్న ఆలోచన చేస్తే విలువైన భూగర్భజలాన్ని కాపాడినవారవుతారు. అవసరం మేరకే మోటారు నడిపించి పొలానికి సరిపడా నీరు అందగానే నిలుపు చేస్తే విలువైన విద్యుత్, నీరు రెండూ ఆదా చేసిన వారవుతారు. విద్యుత్తు లెక్కల ప్రకారం ఒక యూనిట్ ఆదా చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తి చేసినట్లు పరిగణిస్తారు.

ఉష్ణోగ్రతల్లో అసాధారణ పెరుగుదల

భానుడి భగభగలతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వారంరోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. మంథనిలో ఇటీవల అత్యధికంగా 45డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8గంటల నుంచే భానుడు ఉగ్రరూపం చూపుతుండటంతో జనం ఇళ్లు విడిచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండలు తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలెవరూ బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. వేడిగాలులకు ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను భారీగా వినియోగిస్తున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా వీటిని వాడుతుండటంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిపోతోంది.

సాధారణం కన్నా ఎక్కువే



విద్యుత్ వినియోగం సాధారణం కన్నా భారీగా పెరిగింది. ఎండలతో గృహ, వాణిజ్య అవసరాలకు పెరుగుతోంది. డిమాండ్ అధికంగా ఉన్నా.. వినియోగదారులకు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశాం.
– సుదర్శన్, ఎస్ఈ

జిల్లా జడ్జిగా హేమంత్‌కుమార్



హేమంత్‌కుమార్



శ్రీనివాసరావు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా హేమంత్‌కుమార్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన నాగరాజును నల్లగొండ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. హైదరాబాద్‌లో మెట్రోపాలిటన్ నాలుగో అదనపు జడ్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న హేమంత్‌కుమార్‌ను పెద్దపల్లి జిల్లా జడ్జిగా నియమించారు. అలాగే ఖమ్మం జిల్లా జడ్జిగా పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావును గోదావరిఖని అదనపు సెషన్స్ జడ్జిగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటివరకు గోదావరిఖని ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ కమ్ లేబర్‌కోర్టులో పోస్టు ఖాళీగా ఉండగా.. శ్రీనివాసరావు నియామకంతో భర్తీ అయింది.

సమన్వయమే ముఖ్యం

- చేతికొస్తున్న వరి ధాన్యం
- కొనుగోలు కేంద్రాలకు తరలింపు
- ఆరబెట్టడంలో అన్నదాతలు బిజీబిజీ
- అధికారులు పనిచేస్తేనే రైతులకు మేలు



ధాన్యం ఆరబెడుతున్న రైతులు

సుల్తానాబాద్: యాసంగిలో పండించిన ధాన్యం ఇప్పుడిప్పుడే కోతకు వస్తోంది. మరికొందరు రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. గతంలో కొనుగోళ్లు సక్రమంగా జరగక అన్నదాతలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో ఈసారి కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కూడా కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. టార్పాలిన్లు, తాగునీరు, ప్యాడీక్లీనర్లు అందుబాటులో ఉంటే రైతులకు ఇబ్బందులు ఉండవని, వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కూడా సూచించారు. వేసవికాలం కావడంతో రైతులు ఇబ్బంది పడకుండా నీడ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులకు ఉంది. మరోవైపు గత వానకాలం సీజన్‌లో జరిగిన తప్పిదాలు ఈ సీజన్లో జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులు, నిర్వాహకులపై ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

300 కేంద్రాలు ఏర్పాటు

ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 300 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే సుల్తానాబాద్ మండలకేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లో కేంద్రాలను ప్రారంభించారు. మద్దతు ధర క్వింటాల్ గ్రేడ్ ‘ఏ’ రకానికి రూ.2060, సాధారణ రకానికి రూ.2,040గా నిర్ణయించారు. గత వానాకాలంలో అన్నదాతలు చిరిగిన గన్నీ సంచులతో అవస్థలు పడ్డారు. నిబంధనల ప్రకారం తూకం వేయాల్సిన నిర్వాహకులు తాలు, తేమ సాకుతో అధిక తూకం వేస్తూ నష్టపరిచారు. సకాలంలో ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ఈ నేపథ్యంలో యాసంగి కొనుగోళ్లలో గత సమస్యలు పునరావృతం కాకుండా సాఫీగా కొనుగోళ్లు చేపట్టాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈసారైనా చెక్ పడేనా..?

ప్రతి సీజన్‌లో రైస్‌మిల్లర్లే రైతులను ఇబ్బంది పెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తే తేమశాతం లేదని, తాలు వస్తోందని పేర్కొంటూ క్వింటాల్‌కు ఐదు నుంచి ఐదు కిలోల వరకు తరుగు తీశారు. రైతులు ఎన్నిసార్లు ఆందోళనకు దిగినా.. మిల్లర్లలో మాత్రం మార్పు రాలేదు. నిర్వాహకులు మిల్లర్లతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. ఈ సారి అలా కాకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి మిల్లర్లతో ముందుగానే మాట్లాడి కోతలు పెట్టకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

తూకంలోనూ మోసాలు..

గత వానాకాలంలో పలు కేంద్రాల్లో నిర్వాహకులు అదనపు తూకం వేశారు. నిబంధనల ప్రకారం ఒక్కో బస్తా 40.200 కిలోల చొప్పున తూకం వేయాలి. అయితే పలు కేంద్రాల్లోని నిర్వాహకులు మిల్లర్ల పేరు చెప్పి 43 నుంచి 44 కిలోల వరకు అదనంగా తూకం వేశారని రైతులు ఆరోపించారు. ఒక దశలో నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై తర్వాత పంపకాలు చేసుకున్నట్లు కూడా ఆరోపణలు వచ్చాయి. ఈసారి అలాంటివి జరగకుండా నిబంధనల ప్రకారం తూకం జరిగేలా చూడాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రవాణా ఇబ్బందులు తప్పించాలి..

ప్రతి సీజన్‌లో ధాన్యం రవాణా కష్టాలు ఎదురవుతున్నాయి. లారీలు సకాలంలో రాకపోవడంతో తూకం వేసిన బస్తాలు కేంద్రాల్లోనే ఉండిపోయా యి. చివరకు రైతులే అద్దెకు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకుని బస్తాలను మిల్లులకు తరలించిన ఘటనలు ఉన్నాయి. ఈసారి అధికారులు ముందుగానే ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి లారీలు అందుబాటులో ఉండేలా చూడాలంటున్నారు.

ఇలా చేస్తేనే రైతులకు ప్రయోజనం

- ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు చలువ పందిళ్లు వేయించాలి.
- తాగునీటి సౌకర్యం కల్పించాలి. అకాల వర్షాలు వస్తే టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- ప్యాడీక్లీనర్లను సిద్ధంగా ఉంచడం ద్వారా తాలు లేకుండా ఉంటుంది.
- మహిళారైతులు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేయాలి.
- నిర్వాహకులు ఎక్కువ తూకం వేయాలంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వాటిని కట్టడి చేయాలి.

తూకం ఎక్కువగా వేయొద్దు



నిర్వాహకులు సెంటర్లలో కిలో నుంచి 5 కిలోల వరకు అధికంగా కాంటా పెడుతున్నారు. గతంలో తూకం వేసింద్రు. ఇప్పుడు అలా చేయొద్దు. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం ఉంటేనే కొనాలి.
– కొమ్ము తిరుపతి, రైతు, కదంబాపూర్

ప్యాడీక్లీనర్ తెప్పించుకోవాలి



కేంద్రాల వద్ద ప్యాడీక్లీనర్లు అందుబాటులో ఉంచుకోవాలి. ధాన్యాన్ని పరిశీలించాకే కొనాలి. తరుగు పేరిట వేధించొద్దు. అదనంగా తూకం వేసినా.. మిల్లర్లు కోత పెట్టినా నష్టపోయేది అన్నదాతలే. అధికారులు ఈ విషయంలో చొరవ చూపాలి. – బాలసాని లెనిన్, కొత్తపల్లి, రైతు

‘భట్టి’ పాదయాత్రకు నీరాజనం





పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క, చిత్రంలో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, జిల్లాకేంద్రంలో చిన్నారిని ఎత్తుకుని..

- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు
- సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగిన భట్టి
- గంగారంలో బస.. నేడు మండల కేంద్రంలో సభ

కాల్వశ్రీరాంపూర్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్‌లో భాగంగా చేపట్టిన పాదయాత్రకు జనం నీరాజనం పలికారు. బుధవారం జిల్లా కేంద్రం నుంచి ఆయన పాదయాత్ర ప్రారంభించి.. కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాదయాత్రలో ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఆయనకు అడుగడుగునా భారీసంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందించారు. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన రిటైర్డ్ ఎంఈవో పులి మల్లారెడ్డి కోడలు మానికాఅంద్రకరణ్ రెడ్డి దంపతులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్నీ సమస్యలే..

రాష్ట్రం వచ్చాక సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైందని భట్టి అన్నారు. ఆయన పాదయాత్ర పెద్దపల్లి మండలం హన్మంతునిపేట, రాంపల్లి, మారేడుగొండ మీదుగా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లికి చేరుకుంది. అక్కడినుంచి మంగపేట, కూనారం నుంచి గంగారం చేరుకున్నారు. మార్గమధ్యలో పలువురితో మాట్లాడారు. ప్రజలు ఆయనకు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నమ్మిన ప్రజలను మోసం చేసిన రాష్ట్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు రథసారథులుగా నిలువాలని పిలుపునిచ్చారు. మండలంలోని గంగారంలో రాత్రి బస చేశారు.

నేడు కాల్వశ్రీరాంపూర్‌లో బహిరంగ సభ

భట్టి పాదయాత్రలో భాగంగా గురువారం ఉదయం మండల కేంద్రంలో భారీ బహిరంగ సభ ఉంటుందని, మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ కోరారు. కార్యక్రమంలో ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు, సర్పంచులు ఓరుగంటి కొమురయ్యగౌడ్, సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు మునీర్, మాజీ కో–ఆప్షన్ సజ్జుభయ్యా, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడి అశోక్‌గౌడ్, మాదాసు సతీశ్, గాజనవేన సదయ్య ఉన్నారు.

జాతీయ రహదారికి అడుగులు..

- డీపీఆర్ విడుదల.. ఖరారైన టెండర్లు
- మొదటి ప్యాకేజీలో మంచిర్యాల టు మంథని
- పురోగతిలో పర్యావరణ అనుమతులు, భూసేకరణ



జాతీయ రహదారి స్వరూపం ఇలా..

- గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ (నాగ్‌పూర్ టు విజయవాడ)
- ఎస్టిమేటేషన్ కాస్ట్ రూ.14,666 కోట్లు
- ప్రాజెక్టు పొడవు: 405 కిలోమీటర్లు
- ప్రాజెక్టు కాలపరిమితి :2027
- మంచిర్యాల నుంచి మంథని మీదుగా వరంగల్
- జిల్లాలో మంథని, ముత్తారం, రామగిరి మండలాల మీదుగా రహదారి
- ప్రతిపాదించిన భూమి 199.7358 హెక్టార్లు (సుమారు 500 ఎకరాలు)
- గ్రామాలు 16, కిలోమీటర్లు 40
- కేటాయింపులు రూ.2,607 కోట్లు

మంథని: నాగ్‌పూర్ – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భాగంగా మంచిర్యాల–వరంగల్ మధ్య నిర్మించనున్న ప్రతిపాదిత జాతీయ రహదారి నిర్మాణ పనులకు త్వరలోనే మోక్షం కలగనుంది. పనుల నిర్మాణానికి సంబంధించి డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) విడుదల చేయడమే కాకుండా పనుల ప్యాకేజీలను మెగా ఇంజనీరింగ్ సంస్థ దక్కించుకుంది. మొదటి ప్యాకేజీకి సంబంధించి పర్యావరణ అనుమతులు, భూసేకరణ ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. పరిహారం చెల్లింపులో కొందరు కోర్టును ఆశ్రయించారు. అయినప్పటికీ పనులు చేపట్టేందుకు నిర్మాణ సంస్థ సమాయత్తమవుతున్నట్లు సమాచారం. జిల్లా ప్రజలకు త్వరలోనే జాతీయ రహదారి కల నెరవేరనుంది.

మొదటి ప్యాకేజీలో నార్వ నుంచి పుట్టపాక..

కొత్తగా నిర్మించే జాతీయ రహదారికి 2021 ఫిబ్రవరి 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే తరహాలో పట్టణాలు, జనవాసాలకు దూరంగా మైదాన ప్రాంతాలమీదుగా సాగే ఈ జాతీయ రహదారి నాగ్‌పూర్ నుంచి విజయవాడకు చేపడుతున్నారు. ప్యాకేజీ–7 కింద చేపట్టే ఎక్స్‌ప్రెస్ రోడ్డును మూడు ప్యాకేజీల్లో భాగంగా మంచిర్యాల సమీపంలోని నార్వ నుంచి మంథని మండలం పుట్టపాక వరకు 31.466 కిలోమీటర్లు మొదటి విడతలో తీసుకోనున్నారు. నాలుగు వరుసల రహదారి నిర్మాణాన్ని 2027వరకు పూర్తి చేసేలా డీపీఆర్‌లో పొందుపరిచారు. అయితే ప్యాకేజీ–1లోనే జిల్లా ఉండడం.. అడ్డంకులు పెద్దగా లేకపోవడంతో జిల్లా ప్రజలకు త్వరలోనే జాతీయ రహదారికి మోక్షం కలగనుంది.

సర్వేలు పూర్తి

కొత్తగా నిర్మించే జాతీయ రహదారికి 2021 ఫిబ్రవరి 3న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే తరహాలో పట్టణాలు, జనవాసాలకు దూరంగా మైదాన ప్రాంతాల మీదుగా సాగే జాతీయ రహదారి నాగ్‌పూర్ నుంచి విజయవాడకు చేపడుతున్నారు. ప్యాకేజీ–7 కింద మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం వేలాల నుంచి ప్రారంభమయ్యే నాలుగు లైన్ల జాతీయ రహదారి మంథని మండలం ఉప్పట్ల గోదావరి సమీపం నుంచి పోతారం, విలోచవరం, నాగారం, కన్నాల, పందుపల్లి, పుట్టపాక, రామగిరి మండలం ఆదివారంపేట, బేగంపేట, నవాబ్‌పేట, ముత్తారం మండలం లక్కారం, కేశన్‌పల్లి, ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఓడేడ్ మీదుగా వరంగల్ వెళ్తుంది. మూడు మండలాల పరిధిలోని 16 గ్రామాల మీదుగా 40 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. రహదారికి 199.7358 హెక్టార్ల (సుమారు 500 ఎకరాలు) భూమి అవసరమవుతుందని హైవే అథారిటీ సూచించింది.

బేగంపేట, పుట్టపాక వద్ద ఫ్లైఓవర్లు..

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మంథని మండలం పుట్టపాక సమీపంలో రింగ్ రోడ్డు, ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. అలాగే రామగిరి మండలం బేగంపట వద్ద ఫ్లైఓవర్‌కు ప్రతిపాదించారు. ఈ రహదారి నిర్మాణం ద్వారా మంచిర్యాల, పెద్దపల్లితోపాటు కరీంనగర్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది.

భూముల ధరలకు రెక్కలు

జాతీయ రహదారి నిర్మాణానికి అడుగులు పడుతుండడంతో రహదారి మార్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దూకుడు పెంచారు. సమీపంలో వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లను అంటగట్టే పనిలో పడ్డారు. సాధారణంగా ఎకరాకు రూ.ముప్పై నుంచి రూ.50లక్షలు పలుకుతుండగా వ్యాపారులు ఏకంగా రూ.కోటి, రూ.కోటిన్నరకు చేర్చారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో బుధవారం ముస్లింలకు రాష్ట్ర టీఎస్‌టీఎస్‌సీ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమల్ల రాకేశ్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో పాటు నాయకులు ఉప్పురాజు, శివకుమార్, మేకల కుమార్‌యాదవ్, తూముల శ్రీనివాస్, వునుకొండ భూమయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

జెన్‌కో సీఎండీని కలిసిన '1535' ప్రతినిధులు



సీఎండీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రతినిధులు

రామగుండం: ఇటీవల విద్యుత్ ఉద్యోగులకు 2022 సంవత్సరానికి గాను నూతన వేతన సవరణ ప్రకటించినందుకు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్–1535 రాష్ట్ర ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావును కలిసి, సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ తఖీ, ప్రధాన కార్యదర్శి గుర్రం కుమారస్వామి, రామగుండం బ్రాంచి అధ్యక్షుడు అబ్దుల్ నజీ్మ, రాష్ట్రవ్యాప్తంగా వివిధ విద్యుత్ కేంద్రాలకు చెందిన యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీడీకే–5 ఓసీపీని పరిశీలించిన డీడీఎంఎస్



అధికారులతో మాట్లాడుతున్న డీడీఎంఎస్

గోదావరిఖని(రామగుండం): జీడీకే–5 ఓసీపీని డీడీఎంఎస్ మైనింగ్ సంజీవ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. బొగ్గు వెలికితీత, గనిలో తీసుకున్న రక్షణ చర్యలను తెలుసుకున్నారు. రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, మేనేజర్ గోవిందరావు, అనిల్‌గబాలే తదితరులున్నారు.

గుండెపోటుతో రైల్వే కాంట్రాక్టు కార్మికుడి మృతి



సుధాకర్ (ఫైల్)

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా భరత్‌నగర్‌కు చెందిన రైల్వే కాంట్రాక్టు కార్మికుడు అనుమాస సుధాకర్ (52) బుధవారం ఉదయం ఇంట్లో నుంచి విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతూ గుండెనొప్పితో కుప్పకూలిపోయాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సిబ్బంది వచ్చి, పరిశీలించారు. అప్పటికే సుధాకర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సరోజన ఉంది.

ఆర్జీ–1 సీఎస్పీని సందర్శించిన జీఎం



గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 సీఎస్పీని జీఎం శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. మెరిట్ బంకర్, క్రషర్, వాటర్ స్ప్రేయింగ్, కన్వేయర్ బెల్ట్ సిస్టం, అట్లాస్ తదితర విభాగాలను పరిశీలించారు. బొగ్గు త్వరితగతిన రవాణా అయినప్పుడే సంస్థకు లాభాలు వస్తాయని తెలిపారు. ఎండాకాలం దుమ్ము లేవకుండా ఏర్పాటు చేసిన వాటర్ స్ప్రింక్లర్లను, మిస్ట్ క్యానన్‌లను సరిగా వినియోగించాలన్నారు. ఏరియా ఇంజినీర్ రామ్మూర్తి, ఏజెంట్ సైదులు, ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులున్నారు.

చెదిరిన గూడు.. జ్ఞాపకాలు తోడు

- ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో కనిపిస్తున్న ఎల్లంపల్లి గ్రామం
- తరలివచ్చి, తమ ఇళ్లను చూసుకుంటున్న ప్రజలు
- జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ కన్నీరు



ప్రాజెక్టు నీటిమట్టం తగ్గడంతో కనిపిస్తున్న ఇళ్లు



ముంపునకు ముందు ఎల్లంపల్లి గ్రామం

రామగుండం: దశాబ్దం క్రితం పచ్చని చెట్లు.. గ్రామం చుట్టూ పంట పొలాలు, ఇళ్ల పరిసరాల్లో పెరటి తోటలు, పశువులు, పాలు పితికి, పట్టణాలకు తీసుకెళ్లడం.. స్నానం చేసి, గ్రామ నడిబొడ్డున ఉన్న హనుమాన్ దేవాలయానికి వెళ్లడం.. ప్రతీ ఇంటితో అనుబంధం.. పొద్దంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమై.. సాయంత్రం ఇంటి చేరి, బుక్కెడు బువ్వ తిని, ఆరు బయట మహిళలు, కూడళ్లలో గ్రామ పెద్దలు ఓ గంట సేపు ముచ్చటించేవారు. ఇదంతా ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి ముందున్న ఎల్లంపల్లి గ్రామస్తుల జీవన విధానం. కానీ ప్రాజెక్టు నిర్మాణంలో తొలి ముంపు గ్రామం ఎల్లంపల్లే. ఈ పల్లెలో సుమారు 180 గృహాలు ఉండేవి. దాని పక్కనే ముర్మూర్ గ్రామం. గతంలో ఈ రెండు పల్లెలకు ముర్మూర్ గ్రామ పంచాయతీగా ఉండేది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత ఇక్కడి ప్రజలను సమీపంలోని పునరావాస కాలనీకి తరలించారు.

కూలిన గోడలు.. దెబ్బతిన్న రోడ్లు

ప్రస్తుతం వేసవి దృష్ట్యా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం గణనీయంగా తగ్గింది. దీంతో ఎల్లంపల్లి ముంపు గ్రామం పూర్తిగా బయటపడింది. ప్రజలు తరలివచ్చి, తమ ఇళ్లను, తాము కూర్చొని, ముచ్చటించిన ప్రదేశాలను చూస్తూ ఉద్వేగానికి లోనవుతున్నారు. కూలిన గోడలు, దెబ్బతిన్న అంతర్గత రోడ్లు, చెత్త, నాచుతో ఉన్న బోరు, నీటి ట్యాంకును చూసి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు. రామవ్వా.. అదే మన ఇల్లు.. నీళ్ల ట్యాంకు పక్కన ఉన్న బడి.. అదే తొవ్వల కుడిబాజు వస్తే మా ఇల్లే.. అప్పట్ల గద్దె మీద కూర్చొని, ముచ్చట పెట్టుకుంటిమి.. అంటూ పాత గ్రామంలో కలియతిరుగుతున్నారు.

ఆ రోజులు మళ్లీ రావు..



నా చిన్నతనంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం మా ఊరును తీసుకున్నారు. ఆ రోజుల్లో నేను గ్రామంలో ఆడుకున్న ప్రదేశాలు ఇంకా కళ్లల్లో మెదులుతున్నాయి. పచ్చటి చెట్ల మధ్య ప్రశాంతంగా ఉండేవాళ్లం. ఆ రోజులు మళ్లీ రావు.

– తోకల స్రవంతి

స్వచ్ఛమైన వాతావరణం..



ఆ రోజుల్లో ఎల్లంపల్లిలో ఎక్కడచూసినా పచ్చటి చెట్లు ఉండేవి. మా ఇళ్లు కూడా కనిపించేవి కావు. స్వచ్ఛమైన వాతావరణంలో జీవించేవాళ్లం. పంటలు, పక్కనే గళగళ పారే గోదావరి నది.. మా గ్రామం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే.

– గోలివాడ మౌనిక

చెట్ల కింద ఆడుకునేవాళ్లం..



మా గ్రామాన్ని భూసేకరణలో తీసుకున్నప్పుడు నేను యువకుడిని. ఏటా ఎండాకాలంలో చెట్ల కింద, మట్టిలో ఆడుకునేవాళ్లం. ఎండలు మండుతున్నా గోదావరి పరివాహక ప్రాంతం కావడంతో ప్రకృతిని ఆస్వాదించాం. ఇప్పుడు ఏదైనా కృత్రిమమే.

– గుమ్ముల మనోజ్

వినూత్న ఆవిష్కరణలపై దృష్టిసారించాలి



విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: సమాజహితం కోసం వినూత్న ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని కలెక్టర్ సంగీత అన్నారు. రాష్ట్రపతి భవన్‌లో నాలుగు రోజులపాటు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌వారు నిర్వహించిన ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్–2023 ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థినులను బుధవారం ఆమె తన కార్యాలయంలో అభినందించారు. జిల్లాకు చెందిన విద్యార్థులు 2019లోనూ జాతీయస్థాయిలో పెద్దపల్లికి గుర్తింపు తెచ్చారని తెలిపారు. రామగిరి మండలంలోని చందనాపూర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని హర్షిత రూపొందించిన కామన్ ఫ్రెండ్లీ మ్యాన్ ఫ్రెండ్లీ మల్టీపర్పస్ హెల్మెట్, సుల్తానాబాద్ అల్ఫోర్స్ విద్యార్థిని పూజశ్రీ రూపొందించిన యాక్సిల్ కెమెరా ఫర్ స్కూల్ బస్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. విద్యార్థినులను ప్రోత్సహించిన గైడ్ టీచర్లను అభినందించారు. అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, డీఈవో మాధవి, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు, శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

సారూ.. మాకు న్యాయం చేయండి

- సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ విషయంలో వెంకట్రావుపల్లివాసులు
- అడిషనల్ కలెక్టర్‌కు వినతి



అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ రామగిరి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. గత 40 ఏళ్లుగా తాము అక్కడే నివాసం ఉంటున్నామని తెలిపారు. జీవో 78 ప్రకారం వెంకట్రావుపల్లి పంచాయతీ పరిధిలోని కేకే నగర్, కుమారస్వామి నగర్‌కు చెందిన 332 మందిమి 2019లో స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నామని అన్నారు. కానీ 74 మందికి మాత్రమే పట్టాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మిగతావారి దరఖాస్తులను ఎందుకు తిరస్కరించారని సంబంధిత అధికారులను అడిగితే ఇంటి పన్ను రసీదులు 2014 తర్వాత ఉన్నాయని చెప్పారన్నారు. కూలీ పనులు చేసుకునే తాము వేల రూపాయలు నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ ఇళ్ల వద్దకు సర్వే చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా స్థలాలను కొలిపించి, తమకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బుర్ర ముత్యాల గౌడ్, జగన్, ఎల్లయ్య, అస్లాం, తిరుపతి, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల మేలుకు అనేక పథకాలు

- జెడ్పీ చైర్మన్ పుట్ట మధు
- మంథని, ముత్తారం మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ఎక్లాస్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మధు

మంథని: అన్నదాతలకు మేలు చేసేలా అనేక పథకాలను సీఎం కేసీఆర్ తీసుకువచ్చారని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బుధవారం మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్, ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్, ముత్తారం, కాసర్ల గడ్డ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. కొనుగోళ్లలో సమన్వయం లోపించకుండా రైస్‌మిల్లర్లు, హమాలీలు, పీఏసీఎస్ అందరూ కలిసి కట్టుగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. వడగండ్ల వానలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని, కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఖానాపూర్ కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాకర్లపల్లి కేంద్రాన్ని ఎంపీపీ కొండ శంకర్, గోపాల్‌పూర్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సూరయ్యపల్లి కేంద్రాన్ని రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్ ప్రారంభించారు. ముత్తారం సింగిల్ విండో చైర్మన్, కేడీసీసీబీ జిల్లా డెరెక్టర్ గుజ్జుల రాజిరెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య, మంథని సంఘం ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాశ్‌రెడ్డి తదితరులున్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు..

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథని ధర్మారం–గద్దపల్లిలో బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. గ్రామ పంచాయతీ రెండుగా విడిపోయినా ఉమ్మడి పంచాయతీగా క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఓడినా.. గెలిచినా ఆనందమే



ఓవరాల్ చాంపియన్ షీల్డ్ అందిస్తున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ రెమా రాజేశ్వరి



సత్తాచాటిన కోటపల్లి వాలీబాల్ జట్టు సభ్యులు

- మల్టీజోన్–1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి
- ముగిసిన పోలీస్ స్పోర్ట్స్ మీట్

గోదావరిఖని(రామగుండం): యుద్ధంలో ఓడినా గెలిచినా విషాదం ఉంటుందని, అదే క్రీడల్లో ఓడినా.. గెలిచినా ఆనందమేనని మల్టీజోన్–1 ఐజీ ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులపాటు కొనసాగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. పోలీసుల క్రీడలు ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సాహంగా జరిగాయన్నారు. నిరంతరం విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులకు క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. వారంలో ఒక్క రోజు అయినా ఆటలు ఆడాలని చెప్పారు. ఈ పోటీలు నిర్వహించేలా చూడాలని సీపీ రెమా రాజేశ్వరికి సూచించారు. సీపీ మాట్లాడుతూ.. హోంగార్డు నుంచి ఆఫీసర్ వరకు అందరూ క్రీడల్లో ప్రతిభ కనబరిచారని అన్నారు. పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేసిన డీసీపీలు వైభవ్ గైక్వాడ్, సుధీర్ కేకన్, ఏసీపీలను ఆమె అభినందించారు. కలెక్టర్ సంగీత మాట్లాడుతూ.. క్రీడాపోటీలతో ఒత్తిడి దూరమవుతుందని తెలిపారు. అంతేకాకుండా నిరంతరం ఆరోగ్యంగా ఉండగలుగుతామని, టీం వర్క్ అలవడుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఓవరాల్ చాంపియన్‌గా సీఏఆర్..

క్రీడాపోటీల్లో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్(సీఏఆర్) పోలీసులు అత్యంత ప్రతిభను కనబర్చి, ఎక్కువ బహుమతులు సాధించి, ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. అలాగే ఓవరాల్ చాంపియన్‌గా సీఏఆర్ కానిస్టేబుల్ ప్రేమ్‌కుమార్, మహిళా కానిస్టేబుల్ జ్యోతి ఎంపికయ్యారు. కార్యక్రమంలో డీసీపీలు వైభవ్ గైక్వాడ్, సుధీర్ కేకన్, మంచిర్యాల కలెక్టర్ సంతోష్‌నాయక్, ఏఆర్ కమాండెంట్ రియాజ్‌హుల్‌హక్, గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్, పెద్దపల్లి ఏసీపీ మహేశ్, జైపూర్ ఏసీపీ నరేందర్, మంచిర్యాల ఏసీపీ తిరుపతి రెడ్డి, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మోహన్, సీసీఎస్ ఏసీపీలు వెంకటేశ్వర్లు, ఉపేందర్, ట్రాఫిక్ ఏసీపీ బాల్‌రాజ్, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని రాజకీయ శక్తిగా బీఆర్‌ఎస్

- ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): తిరుగులేని రాజకీయ శక్తిగా బీఆర్‌ఎస్ అవతరించిందని ఆ పార్టీ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, ఇన్‌చార్జి ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన రామగుండం నియోజకవర్గ పోలింగ్ బూత్ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, ఇన్‌చార్జిల ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఈ ప్రాంతం అగ్రభాగాన నిలిచి, పోరాడిందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడంలో ముందున్నామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి, ప్రజల సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలన్నారు. బీఆర్‌ఎస్‌కు 41 శాతం, మిగతా అన్ని పార్టీలకు కలిపి 59 శాతం ప్రజాభిమానం ఉన్నట్లు ఇటీవలి పలు సర్వేల్లో తేలిందన్నారు. దీన్ని 60 శాతానికి పెంచేలా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. వచ్చే నెల 3 నుంచి ప్రత్యేక కార్యాచరణతో పోలింగ్ బూత్ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుధ్య నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న ఏపీడీ సత్యనారాయణ

రామగుండం: పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ, ఇతర సామాజిక అంశాలపై అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు ఏపీడీ సత్యనారాయణ అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్–2023 ఫేజ్–2లో భాగంగా వివిధ కార్యక్రమాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో చెత్త సేకరణ, తడి, పొడి చెత్తగా వేరు చేయుట, ప్రతిఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించడం, నీటిని పొదుపుగా వాడటం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, ఇంటి పరిసరాల్లో విరివిగా మొక్కలు, పెరటి తోటల పెంపకం, చెత్తతో తయారు చేసే కంపోస్టు ఎరువును విక్రయించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, ఎస్‌బీఎం కన్సల్టెంట్ రాఘవులు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో మోతె సమ్మిరెడ్డి, ఏపీవో రమేశ్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి విద్యాలయాల్లో సమ్మర్ క్యాంపులు

- అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్, తదితరులు

పెద్దపల్లిరూరల్: వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు 15 రోజులపాటు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నామని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం సంబంధిత పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర సాంఘిక, సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని రామగుండం, గర్రెపల్లి విద్యాలయాల్లో ఈ నెల 22 నుంచి మే 6 వరకు సమ్మర్ క్యాంపులు ఉంటాయన్నారు. ప్రతీ క్యాంపులో 200 మంది 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులుంటారని పేర్కొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు ప్రోగేమ్ కోడింగ్ విత్‌ఔట్ కంప్యూటర్స్, కూచిపూడి క్లాసికల్ డాన్స్, మ్యూజిక్, బ్రైటర్ మైండ్స్‌లో శిక్షణనిస్తారని తెలిపారు. జిల్లా కో–ఆర్డినేటర్ మంజుల, గర్రెపల్లి ప్రిన్సిపాల్ అరుణశ్రీ, పెద్దపల్లి ప్రిన్సిపాల్ సత్యప్రసాద్‌రాజు, సిబ్బంది వేణుగోపాల్, రామకృష్ణ, రాజశేఖర్ తదితరులున్నారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఐదేళ్ల జైలు

గోదావరిఖనిటౌన్(రామగుండం): వేధింపుల కారణంగా ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న కేసులో ఆమె భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ గోదావరిఖని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఆర్.రాజ్‌కుమార్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. బసంత్‌నగర్‌లోని కృష్ణానగర్‌కు చెందిన దేవలక్ష్మి కూతురు స్వప్నను 2010లో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని కుందారం గ్రామానికి చెందిన సుధమల్ల దామోదర్‌కు ఇచ్చి, వివాహం చేశారు. పెళ్లి సమయంలో రెండు తులాల బంగారం, రూ.50 వేలు కట్నంగా ఇచ్చారు. మూడు నెలలు వీరి కాపురం సాఫీగా సాగింది. ఆ తర్వాత దామోదర్ తన భార్యను అందంగా లేవని, లోకజ్ఞానం తెలియదని, అక్రమ సంబంధం అంటగట్టి ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. పెద్ద మనుషుల సమక్షంలో బసంత్‌నగర్‌లో పంచాయితీ నిర్వహించగా ఇకనుంచి బాగా చూసుకుంటానని భార్యను తీసుకెళ్లాడు. అనంతరం కొన్నేళ్లు బాగుండి, స్వప్నను శారీరకంగా, మానసికంగా వేధించి, మళ్లీ ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. ఆ తర్వాత పుట్టింట్లోనే ఉన్న స్వప్న 2015 జూలై 25న బహిర్భూమికని వెళ్లి, చున్నీతో చెట్టుకు ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు బసంత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేయగా అప్పటి ఎస్సై రాజ్‌కుమార్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున గోదావరిఖని ఇన్‌చార్జి అడిషనల్ సీపీ ఆకుల రాములు ఆధ్వర్యంలో ప్రస్తుత ఎస్సై శ్రీనివాస్, బసంత్‌నగర్ కోర్టు కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌లు 19 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. దామోదర్‌పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి రాజ్‌కుమార్ అతనికి జైలుశిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు.

నిర్మాణ రంగ కూలీలకు ఆరోగ్య పరీక్షలు

- జిల్లాలో 39,752 మంది పేర్లు నమోదు
- కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: భవన నిర్మాణ రంగంలో పనిచేసే కూలీలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ సంగీత అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్‌లతో కలిసి సంబంధిత అధికారులు, కార్మిక సంఘ నాయకులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 39,752 మంది కూలీలు తమ పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ నెలాఖరులోగా పెద్దపల్లి, రామగుండం, మంథనిలలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి, వారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్యాంపులు నిర్వహించే ప్రాంత వివరాలను కూలీలకు అందించాలన్నారు. కార్మికశాఖ అధికారులు కోటేశ్వర్లు, శ్రీకాంత్, కో–ఆర్డినేటర్ రవితేజ, రాము, నాయకులు స్వామి, వెంకటేశ్, రాజమల్లు, చంద్రశేఖర్, మహేశ్, బ్రహ్మచారి, మల్లేశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.